జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 67॥ సోమవారం ॥ 3-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

03 ఆగస్టు 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి పంచమి రా. 10:51 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర రా. 9:47 వరకు తరువాత రేవతి యోగం సుకర్మ రా. 9:07 వరకు కరణం కౌలవ ఉ. 11:06 వరకు తైతుల రా. 10:51 వరకు వర్జ్యం ఉ. 7:22 నుండి ఉ. 9:00 వరకు దుర్ముహూర్తం మ. 12:47 నుండి మ. 1:38 వరకు మ. 3:20 నుండి సా. 4:11 వరకు రాహుకాలం ఉ. 7:35 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:57 నుండి మ. 3:33 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు సా. 5:07 నుండి సా. 6:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# మహంకాళి సన్నిధిలో..

## లష్కర్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రాష్ట్ర ప్రభుత్వం తరపున బోనం, పట్టువస్త్రాల సమర్పణ**


**అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి**

**మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఉత్సవాల్లో..**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున జగన్మాతకు సంప్రదాయబద్ధంగా బోనం, పట్టువస్త్రాలు సమర్పించారు.

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. లష్కర్ బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ భారీగా కొనసాగింది. భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించగా, వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ తరువాయి 2 వ పేజీలో..





## ఫ్రెండ్‌షిప్ డే విషాదం

**ఫొటోలు దిగుతుండగా సముద్రంలోకి కొట్టుకుపోయిన యువతి**

విశాఖపట్నం, ఆగస్టు 2: ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా విశాఖపట్నం లోని బీచ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. స్నేహితుల దినోత్స వాన్ని పురస్కరించుకుని బీచ్‌కు వెళ్లిన ఇద్దరు యువకులు అలల తాకిడికి సముద్రంలో గల్లంతయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం తరువాయి 2 వ పేజీలో..



## జైషే కుట్రలో హమీమ్ అరెస్ట్

**జంతర్‌మంతర్ ఆందోళనల్లో అల్లర్లకు కుట్ర చేసినట్లు ఆరోపణలు**

**కోల్‌కతా, ఆగస్టు 2:** దేశంలో అల్లర్లు సృష్టించడం, రాజకీయ నాయ కులను లక్ష్యంగా చేసుకోవడం వంటి కుట్రలకు సంబంధించి నిందితుల పాత్రపై లోతుగా విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతం (మిగతా 2వ పేజీలో)



## ఏఐతో బోనాల భద్రత

**ఉజ్జయిని మహంకాళి ఆలయంలో సీపీ సజ్జనర్ ప్రత్యేక పూజలు**



## పెరూలో విమాన ప్రమాదం
## 13 మంది దుర్మరణం

**జర్మనీ, స్పెయిన్, ఇటలీకి చెందిన పర్యాటకులు మృతి**

దక్షిణ అమెరికా దేశమైన పెరూలో ఘోర విమాన ప్రమాదం చోటుచే సుకుంది. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్ట్ విమానం నజ్‌కా నగర శివారు లో కుప్పకూలి పేలిపోవడంతో విమా నంలో ఉన్న మొత్తం 13 మంది మృతి చెందారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది.

పెరూ మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, పెరూవియన్ సంస్థకు చెందిన ఎరోడియానా టూరిస్ట్ విమానం శనివా రం ఇకా ప్రాంతం నుంచి నజ్‌కా వైపు బయలుదేరింది. విమానంలో 11 మంది విదేశీ పర్యాటకులతో పాటు ఇద్దరు విమాన సిబ్బంది ప్రయాణిస్తున్నారు. ప్రయాణ మధ్యలో నజ్‌కా నగర శివారు లోకి చేరుకున్న సమయంలో విమానం ఒక్కసారిగా అదుపుతప్పి కిందకు దూసుకెళ్లి నేలపై కూలిపోయింది. ప్రమా దం జరిగిన వెంటనే విమానం భారీ పేలుడుతో మంటల్లో చిక్కుకోవడంతో అందులో ఉ న్న వారంతా సజీవదహ నమైనట్లు అధికారులు తెలిపారు. మృతు ల్లో ఇద్దరు జర్మనీ, ఇద్దరు స్పెయిన్, ఏడుగురు ఇటలీకి చెందిన పర్యాటకులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



## ఆస్ట్రేలియాతో ఏపీ వ్యూహాత్మక భాగస్వామ్యం

**ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆస్ట్రేలియా ప్రతినిధులతో కీలక భేటీ**

**నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు**

**స్వచ్ఛ ఇంధనం, ఆధునిక తయారీ, విద్య, నైపుణ్యాభివృద్ధిపై సహకారం**

**రాష్ట్ర అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌తో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కీలక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్--ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

అమరావతి, ఆగస్టు 2: గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన చర్చలకు కొనసాగింపుగా ఇప్పుడు ఆచరణాత్మక చర్యలు ప్రారంభమయ్యాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో స్వచ్ఛ ఇంధనం, ఆధునిక తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో నాలుగు కీలక అవగాహన ఒప్పందాలపై తరువాయి 2 వ పేజీలో..



## ఇరాన్‌పై దాడులు నిలిపివేత

**సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన**

**దాడులు జరిగితే తీవ్ర ప్రతీకారం తప్పదన్న ఇరాన్ హెచ్చరిక**

వాషింగ్టన్, ఆగస్టు 2: ఇరాన్‌పై ప్రతిపాదించిన సైనిక దాడి ప్రణాళికల ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన వివాదాలకు పరిష్కారం కనుగొనే దిశగా జరుగుతున్న చర్చలకు మరింత సమయం ఇవ్వాలన్న ఇరాన్, ఇతర పశ్చిమాసియా తరువాయి 2 వ పేజీలో..

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మిశ్రమ ఫలితాలు ఉన్నప్పటికీ ధైర్యంగా ముందుకు సాగితే ఆటంకాలను అధిగమిస్తారు. బంధుమిత్రులతో సత్సంబంధాలు కొనసాగించడం మేలు చేస్తుంది. మాటల్లో సంయమనం పాటిస్తే ప్రయోజనం ఉంటుంది. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**వృషభం :** గ్రహబలం అనుకూలంగా ఉండి కృషికి తగిన ఫలితాలు లభిస్తాయి. మీ ప్రతిభకు ప్రశంసలు అందుతాయి. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. ఇష్టదైవ ధ్యానం శుభప్రదం.

**మిథునం :** ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూల అవకాశాలు లభిస్తాయి. ఉత్సాహంగా ప్రారంభించిన పనులు సత్ఫలితాలను ఇస్తాయి. స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడుపుతారు. శ్రీఆంజనేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**కర్కాటకం :** పనిభారం పెరిగే అవకాశం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యుల సూచనలు మేలు చేస్తాయి. అనవసర విభేదాలకు దూరంగా ఉండటం మంచిది. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**సింహం :** ప్రణాళికతో ముందుకు సాగితే ఆశించిన విజయాలు సాధిస్తారు. వృత్తి రంగంలో కొత్త అవకాశాలు కలిసి వస్తాయి. మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. గణనాయకాష్టకం పఠించడం శ్రేయస్కరం.

**కన్య :** పెద్దల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. చిన్నచిన్న ఆటంకాలు ఎదురైనప్పటికీ పట్టుదలతో అధిగమిస్తారు. ఖర్చుల విషయంలో మితవ్యయం పాటించడం మంచిది. హనుమాన్ చాలీసా పఠించడం శుభప్రదం.

**తుల :** ఆత్మవిశ్వాసంతో ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. అవసరమైన సమయంలో తగిన సహకారం లభిస్తుంది. బంధుమిత్రులతో అనుబంధం మరింత బలపడుతుంది. ఇష్టదైవారాధన శుభప్రదం.

**వృశ్చికం :** ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆర్థికంగా అనుకూల ఫలితాలు పొందుతారు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించడం మేలు చేస్తుంది.

**ధనుస్సు :** మీ తెలివితేటలు అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబానికి సంబంధించిన ఒక శుభవార్త ఆనందాన్ని కలిగిస్తుంది. మానసికంగా ఉత్సాహంగా ఉండి పనులు పూర్తి చేస్తారు. ఇష్టదైవారాధన శ్రేయస్సును ప్రసాదిస్తుంది.

**మకరం :** అవసరమైన సమయంలో సహాయం లభిస్తుంది. బంధుమిత్రుల సూచనలు పాటిస్తే సమస్యలు దూరం అవుతాయి. ఖర్చులను నియంత్రించుకొని ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలి. శివారాధన శుభప్రదం.

**కుంభం :** దైవబలంతో ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. బుద్ధిబలంతో తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**మీనం :** అనుకూల పరిస్థితులు ఏర్పడి మనఃశ్శాంతి, సంతోషం లభిస్తాయి. వృత్తి, వ్యాపార రంగాల్లో లాభదాయకమైన అవకాశాలు కనిపిస్తాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం గడుపుతారు. ఇష్టదేవత ఆరాధన శుభప్రదం.



## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని, బోనాల ఉత్సవాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## లష్కర్ బోనాల్లో కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి కేటీఆర్ అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండగా, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగకు తగిన గుర్తింపు లభించలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని కేసీఆర్ ఎప్పుడూ చెప్పేవారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని, పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు.

## జైషే కుట్రలో హామీమ్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ రాజకీయ నాయకుల కదలికలపై సమాచారం సేకరించాలని కూడా హ్యాండ్లర్లు హామీమ్‌ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత సువేంధు అధికారికి భద్రత తక్కువగా ఉండే ప్రాంతాల వివరాలు తెలుసుకోవాలని సూచించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర వెనుక మరింత పెద్ద నెట్‌వర్క్ ఉండే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని దర్యాప్తు విస్తరించారు. నాలుగేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా హామీమ్‌కు పరిచయమైన జార్ఖండ్ యువతి అర్పిత సర్కార్ అతనికి కీలకంగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. చిన్నస్థాయి రాజకీయ నాయకులతో పరిచయాలు పెంచుకుని, వారి ద్వారా ప్రముఖ నేతల వివరాలు సేకరించడం, తమ అనుచరులను రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా చేర్పించడం వంటి పనుల్లో ఆమె పాత్ర ఉన్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్‌కు చెందిన ఓ మంత్రి కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలనే కుట్ర కూడా వీరిద్దరూ పన్నినట్లు వెల్లడించారు. అర్పిత సర్కార్‌కు పలువురు రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయని, వారి వ్యక్తిగత, రాజకీయ సమాచారం హామీమ్‌కు చేరవేసినట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, యువతను ఉగ్రవాద సంస్థల్లో చేర్చేందుకు అవసరమైన నెట్‌వర్క్ ఏర్పాటులో ఈ ఇద్దరూ పనిచేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితులు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ సందేశాల యాప్‌ల ద్వారా కొన్నేళ్లుగా సంబంధాలు కొనసాగించినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. వారి వద్ద యునైటెడ్ కింగ్‌డమ్, మెక్సికోకు చెందిన అంతర్జాతీయ సిమ్‌కార్డులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



## ఆస్ట్రేలియాతో ఏపీ వ్యూహాత్మక భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి

సంతకాలు జరిగినట్లు వెల్లడించారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, విద్యా అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. యువతకు ప్రపంచ ప్రమాణాల నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఆధునిక పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్యాలను విస్తరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రపంచ స్థాయి సంస్థలతో కలిసి పనిచేసే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. ఈ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్--ఆస్ట్రేలియా సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, విద్య, పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో దీర్ఘకాలిక సహకారానికి బలమైన పునాది వేస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులు, విద్యా అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు.

## ఉజ్జయిని ఆలయంలో సీపీ సజ్జనర్ ప్రత్యేక పూజలు

**తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ అమలు**

**2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు**

**ముఖ గుర్తింపు సాంకేతికతతో నేరస్థులపై నిఘా**

హైదరాబాద్, ఆగస్టు 2

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీపీ సజ్జనర్, భాగ్యనగరంలో బోనాల పండుగకు గొప్ప చారిత్రక నేపథ్యం ఉందన్నారు. గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు. ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు అనుసంధానంగా ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగిస్తున్నామని సీపీ చెప్పారు. దీని ద్వారా పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వెంటనే గుర్తించి అవసరమైన



చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, క్యూలైన్లలో రద్దీని ఏఐ సాయంతో విశ్లేషించి పరిమితికి మించి జనసమ్మర్థం ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకుని తొక్కిసలాటలు జరగకుండా చూస్తామని తెలిపారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేస్తున్నామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. భక్తులు పోలీసు శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ డే విషాదం

మొదటి పేజీ తరువాయి

ప్రకారం, పెదజాలరిపేటకు చెందిన నీతు అనే యువతి తన స్నేహితులతో కలిసి ఫ్రెండ్‌షిప్ డే వేడుకల కోసం బీచ్‌కు వెళ్లింది. సముద్ర తీరంలో ఫొటోలు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ అల దూసుకొచ్చి ఆమెను సముద్రంలోకి లాక్కెళ్లింది.

నీతును రక్షించేందుకు రాము అనే యువకుడు వెంటనే సముద్రంలోకి దూకాడు. అయితే ఉద్ధృతమైన అలల కారణంగా అతడూ సముద్రంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, సముద్ర భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. పడవలు, ప్రత్యేక బృందాల సహాయంతో సముద్రంలో గల్లంతైన ఇద్దరి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.



సముద్రంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన యువతి, యువకుడి ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. సముద్ర తీర ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు, యువత అలల ఉద్ధృతిని గుర్తించి జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

దేశాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రంప్ సామాజిక మాధ్యమ వేదికలో చేసిన ప్రకటనలో, ప్రతిపాదిత ఒప్పందం వేగంగా ఖరారైతేనే అమెరికా సైనిక చర్యలపై విరామం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో సైనిక చర్యలకు అమెరికా సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రపంచ శాంతి, ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని యుద్ధానికి బదులుగా దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ తెలిపారు. యుద్ధాన్ని ముగించి ఇరాన్‌తో ఒప్పందం చేసుకునే ప్రయత్నాలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఈ విషయంపై ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు అమెరికా తమపై ఈ వారాంతంలో ఎలాంటి సైనిక చర్యలకు పాల్పడవద్దని ఇరాన్ హెచ్చరించింది. ఒకవేళ దాడులు జరిగితే తీవ్ర ప్రతీకారం తప్పదని పేర్కొంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని చమురు క్షేత్రాలతో పాటు ఖతార్, ఇజ్రాయెల్‌లోని గ్యాస్ క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.

ఈ పరిణామాల మధ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై ఖతార్, పాకిస్థాన్ విడివిడిగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించే



దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అమెరికా తాజా నిర్ణయం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు విజయవంతమైతే ప్రాంతంలో యుద్ధ ముప్పు తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నప్పటికీ, పరిస్థితులు ఇంకా సున్నితంగానే ఉన్నాయని పేర్కొంటున్నారు.

శ్వేత

సంపాదకీయం

సోమవారం 3-8-2026

# బడిలోనే.. దేశ భవిష్యత్‌కు పునాది!

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను  అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం.

చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి  భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు.

ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా  ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్దం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.  ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయబడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.






# నెల్లూరులో నూతన పార్కు ప్రారంభం

**రూ.39 లక్షలతో బంగ్లాతోట పార్కు, ఏసీ మినీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి.. ప్రారంభించిన మంత్రి నారాయణ**

నెల్లూరు, ఆగస్టు 2 : నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ నవాబ్‌పేటలో ఆధునికీకరించిన బంగ్లాతోట పార్కు, ఏసీ మినీ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. రూ.39 లక్షల వ్యయంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వినోద, సామాజిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నగరంలో ప్రతిపాదించిన 47 పార్కుల్లో ఇప్పటికే 40 పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పార్కులతో పాటు కుటుంబ, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే ఏసీ మినీ కమ్యూనిటీ హాళ్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను కూడా వేగవంతంగా కొనసాగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశుభ్రమైన, దోమల సమస్య లేని, వరదలను తట్టుకునే మౌలిక వసతులతో కూడిన నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. నగరాభివృద్ధిలో ప్రజల సహకారం కూడా అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు.

# ఇంటింటికీ టీడీపీకి విశేష స్పందన

**ఏడో రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం**

**17.61 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు**

**ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించిన నాయకులు**

**పురోగతిపై సమీక్ష నిర్వహించిన పార్టీ నాయకత్వం**

అమరావతి, ఆగస్టు 2 : అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- రెండు ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది.



కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 17,61,197 ఇళ్లను సందర్శించి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు వెల్లడించింది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించినట్లు పార్టీ పేర్కొంది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించినట్లు తెలిపింది.ఞవివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటూ, వారి సూచనలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికి చేరుకుని ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ తెలిపింది. నియోజకవర్గాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారని వెల్లడించింది. ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నట్లు పార్టీ వివరించింది. ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు నారా లోకేశ్ పిలుపునిచ్చినట్లు పేర్కొంది. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తామని టీడీపీ నాయకత్వం వెల్లడించింది.



# అవయవ దానంపై అవగాహన పెంచాలి

**విశాఖలో అవయవ దాన అవగాహన సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్**

విశాఖపట్నం, ఆగస్టు 2 : విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవయవ దాన అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నతమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. ఒక అవయవ దాత ఏకంగా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపగలడని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై విస్తృతంగా అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,900 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి తెలిపారు. 2025లో 93 మంది దాతల ద్వారా 301 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగా, 2026లో ఇప్పటివరకు 57 మంది దాతల ద్వారా 180 మందికి పునర్జన్మ లభించిందని వెల్లడించారు.

అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల సంఖ్యను 3 నుంచి 9కు పెంచి, మరింత మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అవయవ దానం ద్వారా అనేక కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని మంత్రి అన్నారు. ఈ గొప్ప సేవలో యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, సామాజిక సంస్థలు చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ సదస్సులో వైద్య నిపుణులు, అవయవ దాన సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని మంత్రి తెలిపారు.

# పెన్షన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు, ఆగస్టు 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమంతో పాటు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనదయాళ్ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వేగవంతం చేసి, రెండు నెలల్లో ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమాజంలోని ప్రతి వర్గానికి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో ట్రాన్స్‌జెండర్ సోదరసోదరీమణులకు ఇళ్లను కేటాయించడం ప్రభుత్వం సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.




# మాదకద్రవ్య రహిత తెలంగాణకు గవర్నర్ పిలుపు

**'10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమానికి శ్రీకారం**

**యువతతో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్**

**అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించిన శివ ప్రతాప్ శుక్లా**

**క్రమశిక్షణ, యోగా, ఆధ్యాత్మికతతో ముందుకు సాగాలని సూచన**

హైదరాబాద్, ఆగస్టు 2

మాదకద్రవ్య రహిత భారతదేశమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం నిర్వహించిన '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. భారత యువతే దేశానికి అతిపెద్ద శక్తి అని పేర్కొన్న గవర్నర్, మాదకద్రవ్యాల బారిన పడకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, యోగా, ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని యువతకు సూచించారు. ఈ సందర్భంగా '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' ప్రచార పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార వాహనాన్ని కూడా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించడంలో ప్రభుత్వంతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం భాగస్వామ్యం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.





# పట్నం రుక్మమ్మకు సీఎం నివాళి

**దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పణ**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం**

**పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**

హైదరాబాద్, ఆగస్టు 2

తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్మమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రుక్మమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. రుక్మమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి భగవంతుడిని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, పట్నం మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రుక్మమ్మ జీవితం కుటుంబానికి అందించిన సేవలను స్మరించుకుంటూ



ఆమె ఆత్మకు శాంతి కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు పాల్గొని రుక్మమ్మకు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దశదిన కర్మ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, హాజరైనవారు రుక్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఉజ్జయిని అమ్మవారిని దర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు

- **కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేష్ కుమార్ గౌడ్**
- **వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించిన అర్చకులు**
- **అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించిన టీపీసీసీ అధ్యక్షుడు**

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మహేష్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఉజ్జయిని మహంకాళి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా



మహేష్ కుమార్ గౌడ్ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతుండగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు.

# స్వర్ణ పతక విజేతలకు సీఎం అభినందనలు

- **కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లకు బంగారు పతకాలు**
- **సాక్షి చౌదరి, ప్రియ ఘంఘాస్, అరుంధతి చౌధరికి శుభాకాంక్షలు**
- **దేశానికి గర్వకారణమన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**

హైదరాబాద్, ఆగస్టు 2

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడలు--2026 మహిళల బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత బాక్సర్లు సాక్షి చౌదరి, ప్రియ ఘంఘాస్, అరుంధతి చౌధరిలకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడేలా చేసి దేశానికి గర్వకారణంగా నిలిచిన ముగ్గురు క్రీడాకారిణులను అభినందించారు. వారి అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర శ్రమ విజయానికి కారణమయ్యాయని ప్రశంసించారు. కఠోర సాధనతో




బాక్సింగ్ బరిలో అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాలు సాధించడం దేశ ప్రజలందరికీ ఆనందాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వారి విజయాలు భారత క్రీడారంగ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని అన్నారు. మహిళా బాక్సర్ల క్రీడా స్ఫూర్తి యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టుదల, లక్ష్యసాధనతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమేనని వారి ప్రస్థానం నిరూపించిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే జోష్‌తో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మరిన్ని పతకాలు అందించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచ వేదికపై భారత కీర్తి ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేయాలని శుభాకాంక్షలు తెలిపారు. కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు వరుస విజయాలు నమోదు చేస్తుండటం దేశ క్రీడారంగానికి శుభపరిణామమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# బోనాల ఉత్సవాలకు అమెరికా కాన్సుల్

- **ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించిన లారా విలియమ్స్**
- **బోనాల విశిష్టతను వివరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటే పండుగగా అభివర్ణన**
- **సాంస్కృతిక బంధాలు మరింత బలోపేతమవుతాయని ఆశాభావం**

హైదరాబాద్, ఆగస్టు 2

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఉజ్జయిని మహంకాళి ఆలయ విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను లారా ఈ. విలియమ్స్‌కు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే లష్కర్ బోనాల ఉత్సవాల విశిష్టతను, బోనం సమర్పణ అనంతరం నిర్వహించే సంప్రదాయ 'రంగం' కార్యక్రమం ప్రాముఖ్యతను కూడా మంత్రి వివరించారు. ఈ పండుగ తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసే అవకాశంగా ఈ సందర్శన నిలుస్తుందని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. అమెరికా కాన్సుల్ జనరల్ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా తెలంగాణ--అమెరికా మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లారా ఈ. విలియమ్స్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతిని ప్రత్యక్షంగా అనుభవించడం ఆనందంగా ఉందని పేర్కొన్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అఖిలకు హరీశ్‌రావు అండ

- **ఎంబీబీఎస్ ఫీజు పూర్తిగా భరిస్తానన్న మాజీ మంత్రి**
- **నీట్ రాసిన విద్యార్థినికి ఆత్మీయ భరోసా**
- **మెరిడియన్ విద్యాసంస్థ సేవలను అభినందించిన హరీశ్‌రావు**
- **పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపు**

హైదరాబాద్, ఆగస్టు 2

ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యపై ఆందోళన చెందుతున్న అఖిల అనే విద్యార్థినికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా నిలిచారు. ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజును తానే భరిస్తానని హామీ ఇచ్చి ఆమెకు మనోధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ విడుదల చేసిన వివరాల ప్రకారం, నాలుగేళ్ల క్రితం అఖిల తండ్రి మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ సమయంలో హరీశ్‌రావును ఆశ్రయించగా, ఆయన చొరవతో అఖిలను మెరిడియన్ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివించినట్లు పేర్కొన్నారు. ఇటీవల వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షను అఖిల రాయగా, ఆమెను తన నివాసానికి ఆహ్వానించిన హరీశ్‌రావు ఆత్మీయంగా పలకరించి భోజనం పెట్టారు. వైద్య విద్యను కొనసాగించే విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. విద్యాభ్యాసంలో వెనుకబడిన వారికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అఖిల విద్యాభ్యాసానికి అండగా నిలిచిన మెరిడియన్ విద్యాసంస్థ యాజమాన్యాన్ని హరీశ్‌రావు అభినందించారు. సామాజిక బాధ్యతతో పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్న విద్యాసంస్థలు మరెన్నో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సహాయంతో అఖిల తన వైద్య విద్య లక్ష్యాన్ని సాధించి సమాజానికి సేవ చేసే వైద్యురాలిగా ఎదగాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. అయితే ఈ వివరాలు బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన ప్రకటన ఆధారంగా వెల్లడయ్యాయి.









# తెలుగు వారి సత్తా చాటిన నాయకుడు ఎన్టీఆర్

నెల్లిమర్ల, ఆగస్టు 2 : తెలుగువారి సత్తా దశ దిశలా చాటి చెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నెల్లిమర్ల నియోజకవర్గం పారసాం గ్రామంలో ఎన్టీఆర్, గౌతమ బుద్ధుని విగ్రహాలను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఒక చిన్న గ్రామంలో ఎన్టీఆర్, గౌతమ బుద్ధుని విగ్రహాలు పెట్టుకోవడం చాలా ఆదర్శనీయమన్నారు. మహనీయుల విగ్రహాలు గ్రామాలలో ఉన్నప్పుడు, ఆ విగ్రహాలను చూసినప్పుడు మనిషిలో చైతన్యంతో పాటు ఆశయ సాధన గుర్తుకు వస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ స్థాపించి 9 నెలల్లోనే అధికారం చేపట్టి, ఢిల్లీ పెద్దలకు తెలుగువారి సత్తా చాటిన నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడు రెండు పూటలా కడుపు నింపుకోవాలనే ఆశయంతో కిలో రెండు రూపాయలకే బియ్యం అందజేసిన ఘనత ఎన్టీఆర్ కి మాత్రమే దక్కుతుందన్నారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సారధ్యంలో శ్రీకాకుళం నుంచి కళా వెంకట్రావు, విజయనగరం నుంచి అశోక్ గజపతి రాజు, విశాఖ నుంచి అయ్యన్నపాత్రుడు గార్లను మంత్రిగా చేసిన మహానీయుడు ఎన్టీఆర్ అన్నారు. కొండపల్లి పైడితల్లి నాయుడు మనవడుగా రైతు బిడ్డగా మీ అందరికీ సేవ చేసే అదృష్టాన్ని తెలుగుదేశం పార్టీ అందించిందన్నారు. అనునిత్యం ప్రజల కోసం తపిస్తుందని, అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తుందని, అన్ని వర్గాల వారికి మంచి చేయటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో చూపించిన అభిమానంతోనే తాను భారీ మెజార్టీతో ఎమ్మెల్యే అయ్యానని.. ఇప్పుడు కూడా తనపై అదే అభిమానం చూపిస్తున్నందుకు ధన్యవాదాలు చెపుతున్నానని తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో ఏపీలో కూటమి ప్రభుత్వ పాలనలో అవినీతి రహిత పాలనతో పాటు తిరుగులేని అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రు. 20 లక్షలతో రెండు రహదారుల నిర్మాణంతో పాటు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయ అభివృద్ధి కోసం రు. 40 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ పేదోడు ఈ రోజు పట్టెడన్నం తింటున్నాడంటే మహానీయుడు ఎన్టీఆర్ పుణ్యమే అని.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు అందరూ ఎప్పుడు మనస్సుల్లోనే కొలుచుకునే శ్రీరాముడు, శివుడు, మహానీయుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిచెప్పిన మహానీయుడి విగ్రహాన్ని మారుమూల గ్రామంలో నారయణరావు గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడుపడవోయ్ అన్న గురజాడ మాటే ఆదర్శంగా ఎన్టీఆర్ సినిమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చి కోట్లాది మంది తెలుగు ప్రజల ఉన్నతికి పాటుపడ్డారని బంగార్రాజు కొనియాడారు.

తెలుగుదేశం పోలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యేడ శ్రీదేవి మాట్లాడుతూ కూడు, గుడ్డ, గూడు నినాదంతో తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగుజాతి, తెలుగువాడి గొప్పతనం ప్రపంచ నలుమూలలా తెలియజేసిన మహా వ్యక్తి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఈ రోజు ఈ గ్రామంలో ఆవిష్కరింపజేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు కూడా పేదలు, మహిళలకు అండగా ఉండేందుకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తున్నారని ప్రశంసించారు.



# భారతదేశ ఔనత్యాన్ని చాటి చెప్పే త్రివర్ణ పతాకం

## రూపకర్త పింగళి వెంకయ్య గారి జయంతి నిర్వహించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం, ఆగస్టు 2, భారతదేశ ఔనత్యాన్ని త్రివర్ణ పతాకం చాటి చెప్పుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పేర్కొన్నారు. విజయనగరంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య గారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ముచ్చట కొలిపే మూడు రంగులతో భారతదేశ ప్రజలు గర్వించే విధంగా జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య గారు మన తెలుగు వాడు కావడం గర్వించదగిన విషయమని తెలిపారు. మన జాతీయ జెండా కేవలం జండా కాదని, అది భారతీయ ఆత్మగౌరవానికి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కోట్లాది మందిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత మువ్వన్నెల జెండాకి దక్కుతుందన్నారు. నేడు పింగళి వెంకయ్య గారి జయంతి సందర్భంగా మహనీయుడి త్యాగాన్ని, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని, నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. జాతిపిత గాంధీజీ గారి పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన, మన దేశానికి ఒక ప్రత్యేక జెండా ఉండాలని సూచించగా, అప్పట్లోనే దాదాపు 30 దేశాల జెండాలను పరిశోధించి, భారత సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా త్రివర్ణ పతాకాన్ని రూపొందించారన్నారు. భారత జాతీయ పతాకంలోని ప్రతి రంగుకు ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన అర్థం ఉంటుందన్నారు. కాషాయ రంగు దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల శౌర్యానికి, త్యాగానికి ప్రతీక కాగా, తెలుపు రంగు దేశంలో విలసిల్లాల్సిన శాంతి, సత్యం, పవిత్రతలను సూచిస్తుందనీ, ఆకుపచ్చ రంగు దేశ సుభిక్షానికి, నమ్మకానికి, పచ్చని పంటలతో విలసిల్లే సమృద్ధికి నిదర్శనంగా గుర్తించే విధంగా, మధ్యలో ఉండే 24 ఆకుల అశోక చక్రం నిరంతర ప్రగతికి, ధర్మానికి చిహ్నంగా ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి కొండపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## మస్క్‌కు 57 లక్షల కోట్లు లాస్

### నెల రోజుల్లోనే భారీ క్షీణత

న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా పడిపోయింది. ఆయన నికర విలువలో సుమారు 600 బిలియన్ డాలర్లకు (రూ.57 లక్షల కోట్లు) పైగా కోత పడింది. స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల షేర్లు మార్కెట్లో తీవ్ర ఒత్తిడికి గురవడమే ఈ నష్టానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. అయినప్పటికీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ డ్రైవింగ్, రోబోటిక్స్ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై తన పెట్టుబడుల ప్రణాళికలో మాత్రం మస్క్ వెనక్కి తగ్గడం లేదు. వివరాల్లోకి వెళ్తే, జూన్ 16న మస్క్ నికర విలువ సుమారు 1.33 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో స్పేస్‌ఎక్స్ షేర్ల దూకుడుతో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. అయితే, నెల రోజులు గడిచేసరికి ఆయన సంపద 684 బిలియన్ డాలర్లకు పడిపోయింది.



# ముంపులోనే లంక గ్రామాలు

వైజాగ్, ఆగస్టు 2: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక – గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తు న్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు.

## ఇటు కుండపోత.. అటు ఉక్కపోత

### దేశంలో వింతగా రుతుపవనాలు.. 11 శాతం వర్షపాత లోటు నమోదు

న్యూఢిల్లీ: దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.



# రిజిస్ట్రార్‌పై ప్రభుత్వ కుట్రలు

## వర్సిటీల నియామకాల్లో జోక్యం వద్దు.. సర్కారుకు విద్యార్థి సంఘాల హెచ్చరిక

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మిపై జరుగుతున్నట్లు ఆరోపిస్తు న్న ప్రభుత్వ కుట్రలను సహించబోమని, విశ్వవిద్యాలయాల్లో జరిగే నియామకాల్లో ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నామని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉస్మానియా విశ్వవిద్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర కమిటీ తరఫున డప్పు గోపి మాట్లాడుతూ, 54 ఏళ్ల జేఎన్టీయూ చరిత్రలో తొలిసారిగా ఓ మహిళ రిజిస్ట్రా ర్‌గా నియమితులయ్యారని, అదీ వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళ కావడాన్ని కొందరు జీర్ణించుకోలేకపో తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రార్ పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసర్ జయలక్ష్మిని తొలగించేందుకు ప్రభుత్వానికి అనుకూలంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇటువంటి చర్యలను విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వెనుకబడిన వర్గాల సంఘం జాతీయ అధ్యక్షు డు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సివిల్స్ అకాడమీ చైర్మన్ కొండ నాగేశ్వరరావు, విద్యార్థి నాయకులు కుమ్మరబోయిన సైదులు, భారీ అశోక్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# చివరి రోజు సున్నా

## భారత్‌కు 39 పతకాలే

**కామన్వెల్త్ క్రీడల్లో చివరి రోజు భారత అథ్లెట్లు నిరాశపరిచారు. జుడోలో ఆశలు రేపిన ఇఫ్రూప్ నారంగ్, పారా సైక్లిస్ట్ లిషా దాస్‌లు విఫలమవ్వగా, ఒక్క పతకం రాలేదు. దాంతో, ఈసారైనా నలభైకి పైగా మెడల్స్ సాధించాలనుకున్న భారత బృందం కల నిజమవ్వలేదు. పదోరోజు బాక్సర్లు ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు.. జుడోలో ఉన్నాటి శర్మ గెలిచిన కాంస్యంతోనే టోర్నీని ముగించింది టీమిండియా. 126 మంది బృందంతో వెళ్లినప్పటికీ.. చివరకు 39 పతకాలతో సగర్వంగానే స్వదేశానికి రానుంది.**

గ్లాస్గో ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఆఖరిరోజు మరిన్ని పతకాలు వస్తాయనుకుంటే నిరాశే మిగిలింది. పదోరోజు గెలిచిన మెడల్స్‌తోనే సరిపెట్టుకున్న టీమిండియా.. 39 పతకాలతో తిరిగి స్వదేశం రానుంది. బాక్సర్లు, వెయిట్‌లిఫ్టర్ల పుణ్యమాని 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు వచ్చాయి. ఆశించిన స్థాయిలో మెడల్స్ రాకున్నా ఈసారి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది భారత్. 57 కిలోల బాక్సింగ్‌లో పసిడి కొల్లగొట్టిన జాస్మినే లంబోరియా ముగింపు వేడుకల్లో భారత జాతీయ పతాకాన్ని చేబూని ముందు నడువనుంది.

**భారత పతక విజేతలు:**

స్వర్ణం : మీరాబాయి చాను(వెయిట్‌లిఫ్టర్, 48 కిలోలు), ప్రీతి పవార్(బాక్సర్, 54 కిలోలు), జాస్మినే లంబోరియా(బాక్సర్, 57 కిలోలు), సాక్షి చౌదరి(బాక్సర్, 51 కిలోలు), ప్రియా ఘంఘాస్(బాక్సర్, మహిళల 60 కిలోలు), సచిన్ సివాగె(బాక్సర్, 60 కిలోలు) అస్మితా దే(జుడో), హర్ష్ సింగ్(జుడో), సోమన్ రానా(పారా షాట్‌పుట్), షర్మిలా ధన్కర్(పారా షాట్‌పుట్), దిలిప్ గవిట్(పారా అథ్లెటిక్స్). అరుంధతి చౌదరీ(బాక్సర్ 70 కిలోలు), అంకుశ్ పంగాల్(బాక్సర్, 80 కిలోలు)

రజతం: నీరజ్ చోప్రా(జావెలిన్ త్రో), జుదుమని సింగ్(బాక్సింగ్, 55 కిలోలు), మొహమ్మద్ బసిల్(పారా అథ్లెటిక్స్), సర్వేశ్ కుషారే(హై జంప్), గుల్వీర్ సింగ్(మారథాన్ పరుగు), ప్రవీణ్ చిత్రవేల్(ట్రిపుల్ జంప్), నరేంద్ర బెర్వాల్(బాక్సర్, 90ప్లస్ కిలోలు), లోవ్లీనా బొర్గొహైన్(బాక్సర్, 75 కిలోలు) శుభమ్ జులియా(పారా షాట్‌పుట్),

కాంస్యం: గుల్వీర్ సింగ్(అథ్లెటిక్స్), యశ్వీర్ సింగ్(జావెలిన్ త్రో), సిల్పా శ్యాల(పారా అథ్లెట్) లవ్లీనా బొర్గొహైన్( బాక్సర్, 75 కిలోలు), ఉన్నాటి శర్మ(జుడో), సెల్వ ప్రభు తిరుమరన్(ట్రిపుల్ జంప్), తేజస్విన్ శంకర్(డెకథ్లాన్)






# అభిషేక్ శర్మ ఊచకోత

## 15 ఫోర్లు, 25 సిక్సర్లు .. 91 బంతుల్లో 233 పరుగులు

టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తాజాగా ఓ వన్డే మ్యాచ్‌లో సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అమృతసర్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తూ తరన్ తారన్ మెన్స్ సీనియర్ జట్టుపై 91 బంతుల్లో 233 పరుగులతో చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 25 సిక్సర్లు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.ఇదిలా ఉంటే, అభిషేక్ ఇటీవలికాలంలో టీమిండియా తరఫున వరుసగా విఫలమయ్యాడు. గత ఏడు టీ20 మ్యాచ్‌ల్లో అతడు ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. చివరిగా ఇంగ్లండ్ పర్యటనలో తొలి మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేశాడు. దానికి ముందు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శనలేమీ చేయలేదు. అతడు చివరి సారిగా మూడంకెల స్కోర్ చేసింది ఐపీఎల్ 2026లో. డీసీతో జరిగిన మ్యాచ్‌లో అతడు 68 బంతుల్లో అజేయమైన 135 పరుగులు చేశాడు. తాజాగా జింబాబ్వేతో ముగిసిన 3 మ్యాచ్‌ల సిరీస్‌లో అభిషేక్ ఫామ్ ఘోరంగా పడిపోయింది. ఆ మూడు మ్యాచ్‌ల్లో అతడు వరుసగా 1, 8, 2 స్కోర్లు చేశాడు. ఈ సిరీస్‌లో అభిషేక్ కనీసం రెండంకెల స్కోర్‌ను కూడా చేయలేకపోయాడు. ప్రస్తుతం భారత జట్టు ఖాళీగా ఉండటంతో స్థానిక వన్డే మ్యాచ్ ఆడిన అభిషేక్ ఎట్టకేలకు ఫామ్ దొరకబుచ్చుకున్నాడు. త్వరలో టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుండగా, ఆ పర్యటన నిమిత్తం ఎంపిక చేసిన టెస్ట్ జట్టులో అభిషేక్‌కు చోటు దక్కలేదు. అభిషేక్‌కు గతకొంతకాలంగా టీ20ల్లో మాత్రమే అవకాశం వస్తుంది. తాజా ప్రదర్శనతో అతడు వన్డే జట్టులో స్థానంపై కూడా కన్నేయవచ్చు. టీమిండియా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ నిమిత్తం ఆగస్ట్ 4న శ్రీలంక పర్యటనకు బయల్దేరనుంది. ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్ మ్యాచ్ గాలే వేదికగా ఆగస్ట్ 15న ప్రారంభం కానుంది. దీనికి ముందు భారత జట్టు ఓ వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆసియా కప్‌కు మహిళల జట్టు ప్రకటన




మహిళల ఆసియా కప్ 2026 కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్సీపై ఇటీవల చర్చ జరిగినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్‌నే కెప్టెన్‌గా కొనసాగించింది. స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. జట్టులో స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ వంటి కీలక ప్లేయర్లకు చోటు దక్కింది. టీ20 ప్రపంచకప్ జట్టులో ఉన్న శ్రేయాంక పాటిల్‌కు ఆసియా కప్ జట్టులో చోటు దక్కలేదు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆమె కుడి చీలమండకు గాయమయ్యింది. శ్రేయాంక స్థానంలో టీ20 ప్రపంచకప్ జట్టులోకి వచ్చిన ప్రేమా రావత్ ఆసియా కప్ జట్టులోనూ కొనసాగింది. కాగా, ఆసియా కప్ 2026 సెప్టెంబర్ 17న మొదలై 22వ తేదీ వరకు జరుగనుంది. ఈ టోర్నీ ఫిక్చర్స్ ఇంకా ఖరారు కాలేదు.

**భారత మహిళల ఆసియా కప్ 2026 జట్టు**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమిలిని, అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్.

# ఆటపై ఇష్టంతోనే ఆడుతున్నా: భువీ

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలన్నదే ఇప్పుడు తన ప్రధాన లక్ష్యం కాదని, కేవలం ఆటపై ఉన్న ప్రేమతోనే క్రికెట్ కొనసాగిస్తున్నానని స్పష్టం చేశాడు. భారత జట్టుకు దూరమైన జీవితంతో తాను సంతృప్తిగా ఉన్నానని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు. 36 ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఆర్‌సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "దేశం తరఫున ఆడాలన్న నా కల ఇప్పటికే నెరవేరింది. ఇప్పుడు మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్ప విషయమే. కానీ, దానికోసం ఒత్తిడికి గురికావడం లేదు. ప్రస్తుతం నేను ఆడుతున్నది కేవలం ఆటపై ఉన్న ఇష్టం, క్రమశిక్షణతోనే" అని వివరించాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, యూపీ టీ20 లీగ్‌లలో ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు తెలిపాడు.

# శ్రీలంక పర్యటనకు బుమ్రా దూరం

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు ముందే భారత జట్టుకు బిగ్ షాక్. శ్రీలంక పర్యటనకు ఎంపికైన జస్ప్రీత్ బుమ్రా టెస్టు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఫిట్‌నెస్ టెస్టులో పాసైన బుమ్రా.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడమే అందుకు కారణం. దాంతో, లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు యార్కర్ కింగ్ అందుబాటులో ఉండడని ఆదివారం భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. శ్రీలంక పర్యటనకు స్క్వాడ్‌తో కలుస్తాడనుకున్న జస్ప్రీత్ బుమ్రా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు రోజుల క్రితమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ సాధించిన అతడు.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. కాబట్టి.. లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన బుమ్రాను స్క్వాడ్ నుంచి తప్పించనుంది బీసీసీఐ. ఇంగ్లండ్ పర్యటనలో రెండో వన్డేలో గాయపడిన యార్కర్ కింగ్.. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు ఆడలేదు. సీఓఈలో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన అతడు.. శ్రీలంక పర్యటనకు సిద్ధంగా ఉంటాడని బీసీసీఐ ఆశించింది. కానీ, అతడు వంద శాతం కోలుకోలేదు. దాంతో.. బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ దళానికి అనుభవజ్ఞుడైన సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అయితే.. బుమ్రా స్థానంలో మరొకరిని ఇంకా స్క్వాడ్‌లోకి తీసుకోలేదు.

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.




# సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 3-0తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు.




ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.



# జీరో సైజ్ ఉంటేనే హీరోయిన్లా?

"రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ" చిత్రంతో గుర్తింపు పొందిన నటి అంజలి ఆనంద్.. బాలీవుడ్‌లో నటీమణులు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై గళమెత్తారు. ప్రస్తుతం ధమాల్ 4 సినిమాలో నటించిన ఆమె చిత్ర పరిశ్రమలో అందానికి ఉన్న సంకుచిత నిర్వచనాలను సూటిగా నిలదీశారు. "బాలీవుడ్‌లో గ్లామర్ అంటే కేవలం 'జీరో సైజ్' శరీరాకృతి మాత్రమేనా? ఒక నటి ప్రతిభను కాకుండా, ఆమె రూపాన్ని బట్టి భవిష్యత్తును ఎందుకు అంచనా వేస్తున్నారు?" అని అంజలి ప్రశ్నించారు. తన నటన, కష్టం కంటే తన బరువు గురించే సమాజం ఎక్కువగా చర్చించడం బాధాకరమని, అయితే అటువంటి విమర్శలకు కుంగిపోకుండా తన ప్రతిభతోనే సమాధానం చెబుతానని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం కేవలం తన కోసమే కాదని, ఇటువంటి వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి అమ్మాయి కోసమని ఆమె పేర్కొన్నారు. సంప్రదాయ కథానాయికల రూపానికి భిన్నంగా ఉండే నటీమణులకు బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో పాత్రలు లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటీమణుల బాహ్య రూపాన్ని కాకుండా, వారి నైపుణ్యాలను, భావోద్వేగాలను వాడుకునేలా రచయితలు, దర్శకులు పాత్రలను సృష్టించాలని ఆమె కోరారు. 'ధమాల్ 4'లో తన పాత్ర, తాను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అంశానికి సంబంధించి ఉండటంతో, దానిని అంగీకరించే ముందు కొంత మానసిక సంఘర్షణకు లోనైనట్లు ఆమె వెల్లడించారు.



## డౌటే లేదు..
# డిసెంబర్ 3నే ఫౌజీ: మైత్రి

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొంతకాలం క్రితమే ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఈ సినిమాకు సంబంధించిన పెద్దగా ఎలాంటి అప్డేట్లు బయటకు రాలేదు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా 'కేజేక్యూ' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు హాజరైన ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్‌ను యాంకర్ 'ఫౌజీ' సినిమా గురించి ఏమైనా అప్డేట్ ఇవ్వాలని ప్రశ్నించారు. దీనికి స్పందించిన రవిశంకర్, "ముందుగా ప్రకటించినట్లుగానే డిసెంబర్ 3న 'ఫౌజీ' సినిమాను విడుదల చేస్తాం. అంతేకాదు, విడుదలకు ఒక రోజు ముందు అంటే డిసెంబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్స్ కూడా వేస్తాం" అని స్పష్టం చేశారు. నిర్మాత విడుదల తేదీపై పూర్తి విశ్వాసంతో ఈ ప్రకటన చేయడంతో ప్రభాస్ అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ సినిమా ఎలాంటి వాయిదాలు లేకుండా డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు వస్తుందని వారు గట్టి నమ్మకంతో ఉన్నారు. అలాగే, 'ఫౌజీ' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తుందనే ఆశాభావాన్ని కూడా అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా, హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.




# 'ఎల్లమ్మ' పోస్టర్ రిలీజ్

ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ అందింది. ఆయన కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్న 'ఎల్లమ్మ' చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలైన పోస్టర్‌లో దేవి శ్రీ ప్రసాద్ రెట్రో రగ్డ్ లుక్‌లో, పల్లెటూరి యువకుడిగా ఎంతో సహజంగా కనిపిస్తున్నారు. ఆయన పాత్ర పేరు 'పర్షి' అని ప్రకటిస్తూ, "మీరు గుర్తుంచుకునే పేరు, మీరు ఎప్పటికీ మరచిపోలేని ప్రయాణం" అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్నిబట్టి ఈ సినిమా మట్టితో ముడిపడిన ఒక బలమైన కథతో రాబోతోందని అర్థమవుతోంది. 'బలగం' వంటి జాతీయ అవార్డు పొందిన చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి.

# చిరు, నాగ్‌తో అనిల్ రావిపూడి మల్టీస్టారర్



దర్శకుడు అనిల్ రావిపూడి టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కాలేజీ రోజుల్లో తనకు ఎదురైన ఓ భయంకరమైన సంఘటన గురించి బుల్లితెర నటి శుభాంగి ఆత్రే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఆమె ఇంటర్ చదవుతున్న రోజుల్లో ఓ వ్యక్తి రోజు బైక్‌పై ఫాలో అయ్యేవాడని.. అతని చర్యలు చూసి భయపడిపోయానని శుభాంగి చెప్పింది. 'నేను ఇండోర్‌లో 10-11వ తరగతి చదవుతున్నప్పుడు ఓ వ్యక్తి రోజు బైక్‌పై మమ్మల్ని ఫాలో అయ్యేవాడు. కాలేజీ గోడలపై, రోడ్డుపై నా పేరు, తన పేరు కలిపి రాసేశాడు. మా ఇంటికి ఎదురుగా ఉన్న గోడపై కూడా అలానే రాశాడు. నేను అతనితో ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కానీ మా వెనకే తిరిగేవాడు. ఓ సారి మా అక్క అతనితో మాట్లాడింది. 'ఇలా తిరడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని.. ఏదైనా సాధించి రా.. అప్పుడు మనం మాట్లాడుకుందాం'అని చెప్పింది. కొన్నాళ్ల తర్వాత అతను కనిపించకుండా పోయాడు. ఇలాంటి వేధింపులు ఆడపిల్లలను చాలా భయానికి గురి చేస్తాయి. బయటకు కూడా రాలేరు. ఇంట్లో వాళ్ళ కూడా భయపడతారు. వేధింపులపై మహిళలు, యువతులు మౌనంగా ఉండకూడదు. ధైర్యంగా ఎదురు తిరగాలి. నేటి తరం అమ్మాయిలు తమ రక్షణ విషయంలో మరింత జాగ్రత్తతో వ్యవహరించడం మంచి పరిణామం' అని శుభాంగి అన్నారు.

**కాలేజీ గోడలపై నా పేరు రాసేవాడు**

# థియేటర్లలో మిస్సయినా జీ5లో మిస్‌కాకండి

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించి, బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'లెనిన్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'జీ5' (జుజు5) వేదికగా ఈ సినిమా ఆగస్టు 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. "కొడుతున్నాం కాదు.. కొట్టేశాం అంతే! థియేటర్లలో మిస్ అయితే.. జీ5లో అస్సలు మిస్ అవ్వకండి" అనే ట్యాగ్‌లైన్‌తో జీ5 ఈ



విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున విడుదల చేసిన ప్రత్యేక వీడియోను జీ5 తెలుగు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. "'లెనిన్' సినిమాను థియేటర్లలో ఆదరించి పెద్ద హిట్ చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మనోడు నేరుగా మీ ఇంటికి వచ్చేస్తున్నాడు. అక్కడ కూడా అలాగే ఆదరించండి, తప్పకుండా చూడండి" అంటూ నాగార్జున ఈ వీడియోలో విజ్ఞప్తి చేశారు. జులై 10న థియేటర్లలో విడుదలైన ఈ రూరల్ యాక్షన్ డ్రామా, అఖిల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్లను అధిగమించినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. థియేటర్లలో ఈ సినిమాను వీక్షించలేకపోయిన ప్రేక్షకుల కోసం విడుదలైన నెల రోజులు గడవకముందే ఓటీటీలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

# విన్సెంట్ పాస్టోర్ అనుమానాస్పద మృతి

'ది సోప్రానోస్' సిరీస్‌తో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ప్రముఖ హాలీవుడ్ నటుడు విన్సెంట్ పాస్టోర్ (80) కన్నుమూశారు. న్యూయార్క్‌లోని తన నివాసంలో ఆయన



మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. గత కొన్ని రోజులుగా ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు, ఆయన నివాసానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం లభ్యమైంది. మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. క్రైమ్ డ్రామా సిరీస్ 'ది సోప్రానోస్'లో ఆయన పోషించిన సాల్వటోర్ 'బిగ్ పుస్సీ' బాన్‌పెన్‌సీరో పాత్ర విశేష ప్రజాదరణ పొందింది. గ్యాంగ్‌స్టర్, టఫ్-గై తరహా పాత్రలకు ఆయన పెట్టింది పేరు.

# రజనీకాంత్ కోసమే జైలర్-2లో నటించా

విజయ్ సేతుపతి తాజాగా తన కెరీర్‌కు సంబంధించి ఓ సంచలన నిర్ణయాన్ని వెల్లడించారు. గతంలో కేవలం కథలు నచ్చి, మంచి స్కోప్ ఉన్న అనేక సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు, గెస్ట్ రోల్స్ చేశానని విజయ్ సేతుపతి గుర్తు చేసుకున్నారు. అయితే ఇకపై సినిమాల్లో ఎలాంటి అతిథి పాత్రలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. అయితే రాబోయే 'జైలర్-2' సినిమా మాత్రమే దీనికి ఏకైక మినహాయింపు అని, అది కూడా కేవలం సూపర్‌స్టార్ రజనీకాంత్ కోసం మాత్రమే ఆ పాత్ర చేయడానికి అంగీకరించానని చెప్పారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరిస్తూ.. "రజనీకాంత్‌తో కలిసి పనిచేసే అరుదైన అవకాశం వదులుకోకూడదనే ఉద్దేశంతోనే 'జైలర్-2'లో గెస్ట్ రోల్ చేశాను. ఒకవేళ రజనీ గారితో కలిసి నా ఫోటో ఉన్న పోస్టర్ వస్తే, ఎవరూ నన్ను ప్రత్యేకంగా గమనించరు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467